క్లుప్తంగా

సంజామల ఎంపీడీఓగా సాల్మన్


సాల్మన్

సంజామల: స్థానిక ఎంపీడీఓగా సాల్మన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన నాగకుమార్ ఈ ఏడాది జూన్ నెలలో పదవీ విరమణ పొందారు. దీంతో ఇక్కడే ఏఓగా పనిచేస్తున్న విజయకుమార్‌రెడ్డికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. సాధారణ బదిలీల్లో రెగ్యులర్ ఎంపీడీఓగా సాల్మోన్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓకు ఏఓ విజయకుమార్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన అధికారులు


అధికారులకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. అధికారుల సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న సయ్యదున్నీసా వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు బదిలీ కాగా ఆ స్థానంలో అదే జిల్లాలో పనిచేస్తున్న వర ప్రసాదరావును నియమించారు. ఈఓపీఆర్డీ రాధిక సంజామల మండలానికి బదిలీ కాగా ఆ స్థానంలో కర్నూలు జిల్లా ఆలూరు ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న ప్రకాష్ నాయుడును నియమించారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న అధికారులను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథక సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

ప్యాపిలి ఎంపీడీఓగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

ప్యాపిలి: స్థానిక ఎంపీడీఓగా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన ఫజుల్ రహిమాన్ బేతంచెర్లకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో గడివేముల నుంచి శ్రీనివాసరావు బదిలీపై వచ్చారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్‌గా పని చేస్తున్న నాగరాజు నాయక్ బేతంచెర్లకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో శిరివెళ్ల నుంచి వచ్చిన స్వరూప బాధ్యతలు తీసుకున్నారు.

పలుకూరు ఈఓగా బాధ్యతలు


బాలాంజనేయులు

బనగానపల్లె రూరల్: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ పలుకూరు ఈఓగా బాలాంజనేయులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు భూపన్‌పాడు పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న బాలాంజనేయులు పలుకూరు ఈఓగా విధుల్లో చేరారు.

26 మందికి ఉద్యోగాలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

డోన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక న్యాక్ సెంటర్‌లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. హెటిరో ల్యాబ్, ఎల్‌అండ్‌టీ, టీసీఎల్ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 26 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పదో తరగతి ఆపై చదివిన అభ్యర్థుల కోసం తమ సంస్థ తరచూ జాబ్‌మేళాలు నిర్వహిస్తుందని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మసీదు మినార్‌పై పిడుగు


పిడుగుపాటుతో దెబ్బతిన్న మినార్

అవుకు: మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అవుకు ఈబీసీ కాలనీలో కరెంట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న బిలాల్ మసీదుపై పిడుగుపడింది. దీంతో మినార్ పాక్షికంగా దెబ్బతింది. శుక్రవారం ఉదయం మసీదు చుట్టుపక్కల రాతి ముక్కలను చూసి మసీదుపై పిడుగుపడిందని గుర్తించారు. మసీదు పక్కనే గృహాలు ఉన్నా అర్ధరాత్రి సమయంలో పిడుగుపడడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

వెలుగు ఏపీఎంగా మధుసూదన్ గౌడ్

బేతంచెర్ల: మండల వెలుగు ఏపీఎంగా మధుసూదన్ గౌడ్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో డోన్ వెలుగు ఏపీఎం రామాంజనేయులు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. నందికొట్కూరు మండలంలో పనిచేస్తున్న మధుసూదన్‌గౌడ్ బదిలీపై బేతంచెర్ల మండలానికి వచ్చారు.


కోవెలకుంట్ల: కన్యకాపరమేశ్వరీదేవి


ప్యాపిలి: బాలాత్రిపురసుందరిగా..


అవుకులో మహాలక్ష్మి


బేతంచెర్ల: వాసవీమాత


బనగానపల్లె: బ్రహ్మచారిణిగా చౌడేశ్వరీదేవి

వాసవీమాత పాహిమాం

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. రెండో రోజు శుక్రవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బేతంచెర్లలోని మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులను కటాక్షించారు. –సాక్షి నెట్‌వర్క్


బనగానపల్లెలో బాలాత్రిపురసుందరీదేవిగా కన్యకాపరమేశ్వరి


బేతంచెర్ల: మహాలక్ష్మిని దర్శించుకుంటున్న మహిళలు


డోన్: అమ్మవారిశాలలో స్వర్ణలక్ష్మిగా వాసవీమాత


మద్దిలేటిస్వామి ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవ

పంచాయతీ కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ

సంజామల: మండలంలోని సంజామల, కమలపురి, ముదిగేడు, కానాల గ్రామ పంచాయతీల నూతన కార్యదర్శులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా సంజామలకు బి.లక్ష్మయ్య, ముదిగేడుకు సుధాకర్ రెడ్డి, కానాలకు జి.వెంకట నారాయణ, కమలపురికు రమేష్ రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయా గ్రామ పంచాయతీల్లో విధుల్లో చేరారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి

డోన్ టౌన్: కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములు, వంకలు, వాగులను కాపాడాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల వేదికలో ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో వెళుతున్న ఉడుములపాడు చెరువు వంక, వెంకటనాయునిపల్లె గ్రామ భూములను కబ్జా చేశారని తెలిపారు. అలాగే ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయించారని, వీటితో పాటు మున్సిపల్ స్థలాలను ఆక్రమించారని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్ఎస్‌యూఐ నాయకులు మహబూబ్ బాషా, రఫీ, దాదాకలందర్ తదితరులు ఉన్నారు.

సస్యరక్షణతో మంచి దిగుబడులు


సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త బాలరాజు

కోవెలకుంట్ల: ఈ ఏడాది వరి, మొక్కజొన్న, పత్తి, కంది, మిరప, తదితర పంటలు సాగు చేసిన రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త బాలరాజు సూచించారు. స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో శుక్రవారం కోవెలకుంట్ల, సంజామల, అవుకు, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, కొలిమిగుండ్ల మండలాల వ్యవసాయ సిబ్బందికి ఆయా పంటల్లో రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా పంటల్లో తెగుళ్లు, పురుగుల బారి నుంచి పైర్లను కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో వ్యవసాయ కార్యకలాపాలను నిర్దేశించిన వ్యవధిలో పూర్తి చేయాలని వివరించారు. కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ప్రభావతమ్మ, కోవెలకుంట్ల, సంజామల వ్యవసాయాధికారులు నిరంజన్, సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు


నిందితుడి అరెస్టు చూపిస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల: మండలంలోని కనకాద్రిపల్లె ఎస్సీ కాలనీలో భార్యను హత్య చేసిన కేసులో భర్తను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన బైలేని రామ్మోహన్ మద్యానికి బానిసై కొద్ది రోజుల నుంచి భార్య పార్వతమ్మ(32)పై అనుమానం పెంచుకున్నాడు. తరచూ తాగొచ్చి గొడవపడేవాడు. గురువారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న పార్వతమ్మ తలపై గొడ్డలితో విచక్షణారహితంగా నరకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడు అంకిరెడ్డిపల్లె సమీపంలో ఉండగా అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో మృతి

బనగానపల్లె: అనారోగ్య సమస్యలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య వివరాల మేరకు..

బనగానపల్లె మండలం నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెరువుపల్లె గ్రామానికి చెందిన నడిపి మద్దిలేటి(58) కొద్ది రోజుల నుంచి కడుపునొప్పి, ఆయాసంతో బాధపడుతుండేవాడు. సమస్య తీవ్రతరం కావడంతో మనస్తాపం చెంది గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతిచెందాడు. భార్య రామలచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఇదే పోలీస్‌స్టేషన్ పరిధిలోని అప్పలాపురం గ్రామంలో మద్యం విక్రయిస్తున్న తలారి చిన్నమద్దిలేటి నాయుడును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతని వద్ద నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ప్రకృతి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

డోన్ టౌన్: ప్రకృతిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ప్రపంచ పకృతి దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాతపేట జెడ్పీ హైస్కూల్లో ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. నేటి ఆధునిక సమాజంలో మానవుల తప్పిదాల కారణంగా పకృతిలో మార్పులు చోటుచేసుకుని ప్రళయాలు ఏర్పాడుతున్నాయని తెలిపారు. భూమిపై జీవిస్తున్న సమస్త ప్రాణకోటికి ప్రాణాపాయం కలుగుతోందన్నారు. ప్రకృతిని కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉపాధ్యాయులు వంశీ, చెన్నపురెడ్డి ఉన్నారు.

శిక్షణ తరగతుల పరిశీలన


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా జీసీడీఓ నాగసువర్చల

బనగానపల్లె రూరల్: వృత్తి విద్య ప్రోగ్రాంలో ఉన్న పీ మోడల్ స్కూల్ విద్యార్థుల పని తీరును జిల్లా గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీఓ) నాగసువర్చల శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని షాహా ఎలక్ట్రికల్స్, సత్తార్ వెల్డర్స్, లక్ష్మీ కంప్యూటర్స్, నందిని జిరాక్స్, జీఎండీ ఎంటర్‌ప్రైజెస్, సాయి నెట్‌వరల్డ్, సిద్ధు ఫొటోగ్రఫీ వ్యాపార సంస్థలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ ప్రోగ్రాం విద్యార్థులకు భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ నెల 11వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ రామలక్ష్మి, అధ్యాపకులు మహేష్‌బాబు, రవి ఉన్నారు.

ఉచిత ఇసుక విధానం అమలు చేయాల్సిందే


పాత బస్టాండ్‌లో నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

బేతంచెర్ల: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని సీపీఎం నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండ్‌లో భవన నిర్మాణ కార్మికులతో కలిసి ఇసుక గంపలతో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులైందని.. సంబరాలు చేసుకోవడం మినహా ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఒక టిప్పర్ (20 టన్నులు) ఇసుక రూ. 28 వేలు ఉండగా, వ్యాపారులు ట్రాక్టర్ ఇసుకను రూ. 12 వేలకు అమ్ముతుండడంతో నిర్మాణ పనులు ఆగిపోయి భవన నిర్మాణ కార్మికులు పనులు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు నాగరాజు, శ్రీకాంత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరామ్ డిమాండ్ చేశారు.

డోన్‌లో రాస్తారోకో

డోన్ టౌన్: ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని స్థానిక బేతంచెర్ల సర్కిల్‌లో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఇసుక లేకపోవడం వల్ల నిర్మాణ రంగం కుదేలవుతోందని తెలిపారు. ఫలితంగా కూలీలు పనులు దొరక్క రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అవుకు ఎంపీడీఓగా వెంగన్న



అవుకు: నూతన ఎంపీడీఓగా వెంగన్న శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా బేతంచర్ల నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి డోన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీఓకు స్వాగతం పలుకుతూ, బదీలిపై వెళ్తున్న ఎంపీడీఓను సన్మానించారు.

నష్టం మిగిల్చిన వర్షం

• కొలిమిగుండ్ల మండలంలో 35.2 మి.మీ వర్షం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కొలిమిగుండ్ల మండలంలో అత్యధికంగా 35.2 మి.మీ, కోవెలకుంట్లలో 19.6 మి.మీ, సంజామలలో 18.2 మి.మీ, దొర్నిపాడులో 12.2 మి.మీ, అవుకులో 12.2 మి.మీ, ఉయ్యాలవాడలో 9 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న ప్రస్తుతం కోత, నూర్పిడి దశలో ఉండగా ఆయా ప్రాంతాల్లో కురిసిన వర్షంతో నష్టం వాటిల్లింది. అర్ధరాత్రి వేళ దిగుబడులు తడవకుండా రైతులు పట్టలు కప్పుకునేందుకు అగచాట్లు పడ్డారు. పత్తి పూత, పిందె దశలో ఉండగా వర్షం కారణంగా పూత రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ పంటల సాగుకు వర్షం అనుకూలంగా మారినా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు నష్టం చేకూరడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ.80 లక్షల నష్టపరిహారం


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

బేతంచెర్ల: రహదారుల నిర్మాణంలో భూములు, ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న రైతులు, ప్రజలకు ల్యాండ్ యాక్ట్ ప్రకారం పరిహారం చెల్లిస్తామని నంద్యాల జేసీ విష్ణుచరణ్ తెలిపారు. మండలంలోని ముద్దవరం, ఎం.పేండేకల్లు గ్రామాల్లో డబుల్ రోడ్డు నిర్మాణంలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న రైతులతో శుక్రవారం బేతంచెర్ల తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. నష్టపరిహారం చెల్లించే విషయంపై మాట్లాడారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఎకరాకు రూ.80 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. ఇందులో సెంటు, అరసెంటు ఉన్నా పరిహారం ఇస్తామని తెలిపారు. కొలతల్లో అభ్యంతరాలు ఉంటే మరోసారి సరిచూసుకోవాలని ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ మహేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాశ్‌బాబు, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, డీటీ మారుతి, ఆర్ఐ శ్రీదేవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పురోహితులు

బేతంచెర్ల: పట్టణంలోని చెన్న కేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, మహామంగళహారతి, గణపతిపూజ, పుణ్యహవాచనం తదితర పూజలు చేశారు. మధ్యాహ్నం 12:30 గంటలకు అభిజిత్ లగ్నంలో వేద మంత్రాలు, డోలు వేయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణ తంతు జరిగింది. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈఓ మద్దిలేటి, గ్రూపు దేవాలయాల మాజీ చైర్మన్ సుజాత శర్మ, బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, వీరారెడ్డి, బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి, పుల్లారెడ్డి, నాగమోహన్, రమణ పాల్గొన్నారు.


కర్నూలు రహదారిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


డోన్ రహదారిలోని హెచ్‌కొట్టాల వద్ద..

వర్షమొస్తే నీటికుంటే

బేతంచెర్ల: పట్టణంలోని పలు రహదారులు చినుకు పడితే చాలు నీటి మడుగును తలపిస్తున్నాయి. గురువారం రాత్రి కురిసిన వర్షానికి కర్నూలు రహదారి, డోన్ రహదారిలో రహదారిపై భారీగా నీరు నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారిపై నీరు నిలిచిపోవడం వల్ల రహదారులు దెబ్బతినే ఆశకాశం ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం తగదు


ఇరుకైన రోడ్డు పక్కన ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

డోన్: పట్టణ నడిబొడ్డున అనేక విద్యాసంస్థలు ఉన్న ఇరుకైన ప్రాంతంలో విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని స్థానికులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. శ్రీసుధ, వెంకటేశ్వర ప్రాథమిక పాఠశాలలతో పాటు అనేక జూనియర్ కళాశాలలు ఉన్న ఎస్‌కేపీ హైస్కూల్ వెనుక ప్రాంతంలో కేవలం 15 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడటమేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. సెలవు దినాల్లో ఈ పాఠశాల ప్రహరీ పైకి ఎక్కి మైదానంలోకి వెళ్లి ఆటలాడుకునేందుకు చాలా మంది పిల్లలు ప్రయత్నిస్తుంటారని, ఈ సందర్భంగా ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు సరైన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి చుట్టూ రక్షణ కోసం ప్రహరీని ఏర్పాటు చేస్తే సమంజసంగా ఉంటుందని సూచిస్తున్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

సంజామల: రైతుల సంక్షేమమే లక్ష్యంగా పశువైద్య సిబ్బంది పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆళ్లగడ్డ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకట రమణయ్య అన్నారు. శుక్రవారం సంజామల ప్రాంతీయ పశువైద్యశాలలో ఏడీ మోహన్ రావుతో కలిసి సంజామల, కొలిమిగుండ్ల పశువైద్యులు, సిబ్బందితో సమీక్షించారు. పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని తెలిపారు. కాలనుగుణంగా వాక్సినేషన్ పూర్తి చేయాలని సూచించారు. రైతు నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పశువైద్యులు రఘుబాల క్రిష్ణ, రమేష్ బాబు, పద్మావతి, కస్తూరి పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం

డోన్ టౌన్: ప్రభుత్వ ఆదేశాలను విస్మరించి ప్రైవేట్ విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినా డోన్‌లోని పలు ప్రైవేట్ విద్యా సంస్థలు తరగతులు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేస్తామన్నారు.